# కలుపుమొక్కలు

– ఎమ్.ఎస్. ప్రకాశరావు, Morganville, NJ.

"అబ్బా! ఈ దిక్కుమాలిన పార్తీనియం మళ్ళీ పెరుగుతోందిరా భగవంతుడా!" అనుకున్నాడు అనంతం ప్రక్క కాంపౌండులోకి చూస్తూ.

హైదరాబాదుకి చుట్టూ కుక్కగొడుగుల్లాగ పుట్టుకొస్తున్న కాలనీలలో ఒకటది. అయిదారేళ్ళ క్రితం ముచ్చటయిన ఇల్లు కట్టుకుని అక్కడికి వచ్చాడు అనంతం. అతనూ, భార్య మాత్రమే ఉంటున్నారు. ఇద్దరు కొడుకులూ రెక్కలొచ్చి ఎగిరిపోయారు. ఒకడు అమెరికాలోనూ, ఇంకొకడు కలకత్తాలోనూ వాలారు. కాని అతనికి క్రొత్తయింటి మోజు, స్వంతయింటి ఆనందోత్సాహాల పొంగు తగ్గకుండానే ఉబ్బసంలాంటి రోగం పట్టుకుంది. అతని ఏభయ్యయిదేళ్ళ జీవితంలోనూ గట్టిగా తుమ్మియెరుగడు. అటువంటిది యీ ఇంటికి వచ్చాక మెషీన్‌గన్ లాగ ఏకధాటిగా ప్రేల్చి పారేస్తున్నాడు తుమ్ముల్ని. దానికి తోడు విపరీతమయిన ఆయాసం. రాత్రిళ్ళు మరీ బాధ అనుభవించేవాడు. పడుకుంటే ఊపిరి ఆడేది కాదు. రాత్రంతా సోఫాలో కూర్చుని కునుకు తీసేవాడు. డాక్టరు అన్ని పరీక్షలు చేసి అదేమీరోగం కాదని చెప్పి ఉపశమనానికేవో మందులిచ్చాడు. అవి పని చేయలేదు సరికదా, పగలు ఆఫీసులో కూడ నిద్రముంచుకొచ్చేది. ఏమయితేనేం స్వంతయింటికి వచ్చాక ఇది క్రొత్త అనుభవం.

"ఇల్లు అచ్చిరాలేదు, మారిపోదాము" అని పోరింది భార్య. అచ్చిరాకపోవడమంటే ఏమిటి? నక్షత్రాలూ, గ్రహాలూనా? లేక భూత పిశాచాల ప్రభావమా? అవంటే నమ్మకంలేని అనంతం కొట్టిపారేశాడు భార్య సలహాని. "వాస్తు సరిగాలేదేమో, ఎవర్నయినా సంప్రదించు" అని సలహా ఇచ్చాడు ఆఫీసులో సహోద్యోగి ఒకతను. "వద్దు బాబోయ్! ఇల్లు పీకి పందిరివేయమంటాడు" అని నవ్వేశాడు దానిపైన కూడ నమ్మకంలేని అనంతం. కాని తాను బాధ పడుతున్నది మాత్రం నిజం. దానికి కారణమేదో ఉండాలి. అతని దృష్టి ప్రక్క కాంపౌండులో దుబ్బుగా పెరిగివున్న పార్తీనియం మొక్కలపైన పడింది. తెల్లని చిన్న పువ్వులతో చూడముచ్చటగా ఉంటాయామొక్కలు. అవి ఎక్కడపడితే అక్కడ మొలుస్తాయి. ఖాళీస్థలం కనబడితే చాలు, అదేదో తమస్వంతంలాగ అందులో నివాసమేర్పరచుకుంటాయి. వాటిని గురించి ఎప్పుడో పేపర్లలో చదివాడు. పార్తీనియం లాటిన్ అమెరికాకు చెందిన కలుపుమొక్క. ఎప్పుడో అమెరికా వారి పి.ఎల్.480 పథకం రోజుల్లో ఎలానో వచ్చిపడింది ఇండియాలో. దావానలంలాగ దేశాన్నంతటినీ ఆక్రమించేసింది. అదొక మహామారి. అదివున్నచోట ఉబ్బసరోగాలూ, ఎగ్జిమాలాంటి చర్మవ్యాధులూ ఎక్కువ మోతాదులో ఉంటాయయట. దీనిని గురించి బెంగళూరులో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్సులో చాలా పరిశోధనలు చేశారని విన్నాడు. అనంతం బెంగుళూరు వెళ్ళాడు. అక్కడి సైంటిస్టులు పరీక్షలు చేసి అతనికి పార్తీనియం ఎలర్జీ ఉందని నిర్ధారణ చేశారు. అంటే తనయింటి వాస్తుదోషము ప్రక్కన ఖాళీగా పడి ఏడుస్తున్న స్థలమన్నమాట. గ్రహదోషం–దాంట్లో యిల్లుకట్టకుండా ఉంచేసిన శనిగ్రహము. ఈ పార్తీనియం పూజాపునస్కారాలతో శాంతించేదికాదుట. దాన్ని పీకిపారేయడమే కాకుండ అక్కడిక్కడే తగులబెట్టాలిట. లేకపోతే రావణాసురుడి తలకాయల్లాగ అవి అలా పుట్టుకొస్తూనే ఉంటాయిట. అందుచేత మనిషిని పెట్టి వాటిని పీకి అక్కడికక్కడే తగులబెట్టమని డబ్బిచ్చాడు. కాని పొరుగున నివసిస్తున్న లాయరుగారు పొగవస్తుందని అభ్యంతరం చెప్పడంతో తగులబెట్టడం జరుగలేదు. ఏమయితేనేం, ఏ బాధలేకుండా అతను కొంతకాలం హాయిగా నిదురపోగలిగాడు. అవి తిరిగి పెరగనే పెరిగాయి, అతని ఉబ్బసం రానేవచ్చింది.

అనంతానికి చిరాకు ఎక్కువయింది. తానేమీచేయలేని పరిస్థితిలో పడ్డాడు. ఆలోచిస్తే అప్పుడప్పుడనిపించేది "తానేమి చేయలేడా" అని. "ఎందుకు చేయలేడు?" అని ప్రశ్నించుకునేవాడు. తాను చేయగలడు. కాని తానెందుకు చేయాలి? ఎవడో ముక్కూమొహం తెలియనివాడి స్థలాన్ని తానెందుకు బాగుచేయాలి? అది తన బాధ్యత కాదు.

అనంతం చేయగలిగిందల్లా ప్రక్క కాంపౌండులోకి చూస్తూ పళ్ళు పటపటలాడించడం మాత్రమే. ఒకసారి అక్కడేదోమార్పు కనిపించిందతనికి. తెల్లగా మెరిసిపోయే ఆ పార్తీనియం క్షేత్రం చాలాభాగం ఆకుపచ్చగా కనబడింది. అనంతం పరీక్షగా చూడగా అక్కడ వేరేరకం కలుపుమొక్కలు తలెత్తుతున్నాయి. అతని కళ్ళముందే వారంరోజుల్లో ఆ క్రొత్తమొక్కలు పార్తీనియాన్ని అణగద్రొక్కి తమ ఆధిపత్యాన్ని నిరూపించుకున్నాయి. అక్కడా ఇక్కడా ఒకటి రెండు పార్తీనియం మొక్కలు శత్రుబలాలకి లొంగిపోయిన సైనికుల్లాగ నిర్వీర్యంగా కనబడ్డాయి. ఈ క్రొత్తమొక్క గురించి అతనికేమీ తెలియకపోయినా ఆ సంవత్సరమతనికేరోగం రాలేదు. తన సమస్య ప్రకృతే తీర్చేసిందని పొంగిపోయాడు. కాని అతని ఆనందం అనంతంగా నిలిచిపోలేదు. మరు సంవత్సరం దుష్ట పార్తీనియం బలాన్ని పుంజుకొని తిరిగి విజృంభించింది. మంచికి చెడుకీ మధ్య పోరాటం ఒక్క మానవ సమాయంలోనే కాకుండా నిశ్చలన జీవరాశిలో కూడ అవిరామంగా సాగుతూ ఉంటుందనే విషయాన్నతడు కళ్ళారా చూశాడు. దానివల్ల అతనికొకప్రకృతిసత్యం తోచింది. ప్రతిజీవరాశిలోనూ నిరాకారబ్రహ్మం వలె డిఎన్ఎ. ఉంటుందంటారు శాస్త్రజ్ఞులు. అది తనలోనుండి శక్తిస్వరూపిణి లాంటి ప్రొటీన్‌ని పుట్టిస్తుందట. ఆ రెండూ కలిసి స్వజాతిని పెంచేసుకుంటూ పోతాయట. ఈ నిరాకారబ్రహ్మ–శక్తి జంట అంతటితో ఆగక అనేక రకాల యితర ప్రొటీన్లని తయారుచేస్తాయట–కొన్ని తమని రక్షించుకోవడానికి, మరికొన్ని శత్రు డి ఎన్ ఏ. ప్రొటీన్ల జంటలని నాశనం చేయడానికి. మంచీ–చెడుల మధ్య పోరాటం సమాజం, ప్రకృతిలోనే కాకుండా మానవ అంతరంగంలోనూ నిరంతరం జరుగుతూనే ఉంటుంది. అందుకనే ఎవరూ పూర్తి దుర్మార్గులూ కారు, పూర్తిగా మంచివాళ్ళూ కాదు. ఇలా అనంతంలో వంకరటింకరగా నడుస్తున్న ఆలోచనలకి అంతరాయం కలిగించాడు రోడ్డుమీద పోతున్న నాగయ్య. అదేవీధిలో మూడిళ్ళకవతల ఉన్న స్థలంలో గుడిశ వేసుకుని ఉంటున్నాడు నాగయ్య భార్యా, ఇద్దరు కొడుకులతో. ఆ స్థలం నాగయ్యది కాదు. దాన్ని కొనుక్కున్నాయన అమెరికాలోనో, మరెక్కడో ఉంటాడు. "ఆయనగారొచ్చినప్పుడు చూద్దాం సార్" అనేవాడు.

"మీ తెల్లమొక్కలు మళ్ళీ మొలుస్తున్నట్లున్నాయి. రేపొచ్చి పీకేయమంటారా? డబ్బేమీ వద్దులెండి. ఇరుగు పొరుగు వాళ్ళం ఒకరికొకరు సాయం చేసుకోకపోతే ఎలా?" అని వెళ్ళిపోయాడు. ఆ మర్నాడు

నాగయ్యరాలేదు. మూడురోజుల తరువాత అతను పోయాడని విన్నాడు. సిరోసిస్ ఆఫ్ లివర్. త్రాగుడు ఫలితమది.

నాగయ్య పోయాడంటే అనంతం బాధపడ్డాడు. కేవలం సాటిజీవి అనే సానుభూతితో మాత్రమే కాదు. తానా కాలనీకి వచ్చినప్పటినుండి చూస్తున్నాడు. అనంతం దృష్టిలో నాగయ్య చిన్నతరహా ఎంటర్ ప్రెనీర్. అతను నాలుగు చక్రాల తోపుడు బండిలో ఇస్త్రీ పెట్టెని పెట్టుకుని, అక్కడికి ఒక కిలోమీటరుదూరంలో ఉన్న ఎపార్ట్‌మెంటుకాంప్లెక్సు దగ్గరికి పోయేవాడు. అక్కడ నాలుగయిదు వందల కుటుంబాలు ఉంటాయి. ఈ రోజుల్లో బట్టల్ని ఉతకడమయితే ఏదోవిధంగా చేసుకుంటారు కాని ఇస్త్రీ మాత్రం చాలామందికి కష్టంగా ఉంటుంది. పైగా బోర్ అనిపిస్తుంది కూడ. నాగయ్య పెద్ద విద్యాధికుడు కాకపోయినా, 'ప్రజలకి అవసరమయిన ప్రోడక్టుని గాని, సర్వీసుని గాని వాళ్ళకి ఎప్పుడు ఎక్కడ కావాలో అప్పుడక్కడ అందజేయాలనే' మార్కెటింగ్ సూత్రాన్ని పాటించి, షర్టుకి రూపాయిమొదలు చీరకి అయిదురూపాయలవరకు అందరికీ అందుబాటులో ఆ కాంప్లెక్సు వాళ్ళ అవసరాలు తీరుస్తూ వ్యాపారం సాగించాడు. వారానికి ఏడెనిమిది వందలు సంపాదించవచ్చు. అతన్ని చూసినప్పుడల్లా అనంతానికనిపించేది, పైకి రావడానికి భారతదేశంకూడా ఎన్నో అవకాశాలున్న దేశమని. పాశ్చాత్యదేశాలలో ఇలా చిన్నగా ప్రారంభించి మిలియనేర్లయిపోయారు. కాని భారతదేశంలో అటువంటి 'సక్సెస్ స్టోరీస్' వినిపించవెందుచేత? కాంక్ష లేక పోవడమా? ఉన్నదానితో తృప్తిపడే ప్రాచీన మనస్తత్వమా? బద్ధకమా? లేక చేతగానితనమా? నాగయ్యలోని లోపం త్రాగుడు. వారానికి నాలుగురోజులు మాత్రం పనిచేసి, మిగత మూడురోజులూ ఆ సంపాదనని త్రాగుడికి తగలబెట్టేవాడు. అతని భార్య, అతనిచేత దెబ్బలు తింటూ నానా అవస్థలూపడి ఇంటిని నడిపేది. పిల్లలిద్దరినీ బడిలో వేయడమయితే చేశాడు కాని ధనాభావంతో మానిపించేశాడు. చదువు, సంధ్య లేక వాళ్ళు రోడ్డున పడ్డారు.

నాగయ్య పోయిన తరువాత, అతని పెద్దకొడుకు పదిహేను పదహారేళ్ళ వయస్సువాడు గంగరాజు దగ్గర జేరాడని విన్నాడు అనంతం. గంగరాజంటే ఆ ప్రాంతంలో అందరూ హడలి చచ్చిపోతూవుంటారు. అతడు పెద్దరౌడీ అని పేరు. అక్కడ ఏ అల్లరి జరిగినా, దౌర్జన్యం జరిగినా అది గంగరాజు పనే అయివుంటుందంటారు. పైగా నాగయ్య కొడుకులాంటి చిన్న కుర్రవాళ్ళని ఉపయోగించుకొని దొంగసారా, డ్రగ్సు అవీ ఇవీ స్కూలు, కాలేజి పిల్లలకి సరఫరా చేస్తుంటాడంటారు. అతనికి కొన్ని రాజకీయపక్షాల మద్దతువుందనే అభిప్రాయం చాలమందికి ఉంది. వీటిలో ఎంత సత్యముందో తెలియదు. కాని నాగయ్యకొడుకు అటువంటి వ్యక్తి పర్యవేక్షణలో పడ్డాడని వినేసరికి అనంతం దానికి తానే బాధ్యుడైనట్లు బాధపడ్డాడు. దానికి కారణంవుంది. తానొకసారి నాగయ్యతో అన్నాడు, పిల్లల్ని బడికి పంపించరాదా అని.

"ఎలా పంపేది సార్? ఇద్దరి పిల్లలకి నెలకి అరవై, డెబ్బయి రూపాయలవుతుంది" అన్నాడు.

"పోనీలే నేనిస్తానులే" అన్నాడు అనంతం.

అనంతం కొడుకులిద్దరు వాళ్ళ కాళ్ళమీద వాళ్ళు నిలబడ్డాక అతనికి బాధ్యతలు తీరిపోయాయి. కావాలంటే ఒకళ్ళిద్దరు పిల్లల్ని తాను చదివించగలడు. కాని, అతనిలోని పార్థీనియం నాగయ్య ఆడబ్బుతో తాగి తందనాలాడుతాడని హెచ్చరించింది. దాంతో తాను తిరిగి ఆ ప్రస్తావన తీసుకునిరాలేదు. నాగయ్య అడగనూలేదు. పర్యవసానమిది.

ఒకసారి నాగయ్య కొడుకు రోడ్డుమీద కనిపించాడు. "ఏరా అబ్బాయి, మీ నాన్న వ్యాపారం తిరిగి ప్రారంభించాలంటే చెప్పు. ఏమైనా సాయం కావాలంటే నేను చేస్తాను" అన్నాడు.

"మా గురువుగారుండగా ఆ వెట్టి చాకిరి దేనికండి?" అన్నాడు వాడు.

"మీ గురువుగారంటే ఎవరురా?"

"అదేంటండి? మా గంగరాజుగారే. ఆయన చాలా మంచోరండి. చూస్తూవుండండి. ఆయన మినిస్టరయిపోతారు. అప్పుడు చూడండి మా తడాఖా. ఇక్కడ బంగళాలు కట్టుకుని కార్లమీద బూర్ బూర్ మంటూ తిరుగుతున్నారు చూడండి. ఆళ్ళ టాపులు లేపి పారేస్తాము." అని గొప్పగా చెప్పాడు. ఒకే గుక్కలో గంగరాజుని మంచివాడనీ, అతని మద్దతుతో తాము చేయబోయే దౌర్జన్యంగురించి చెప్పాడు. 'మంచి' అన్న పదానికి వాడి నిర్వచనమేమిటో అనంతానికి అర్థంకాలేదు. ఈ కాలనీలో ఇంకో పార్థీనియం తయారవుతోందా?

"ముందే చెప్పి బ్రతికించావు. నేనీ కాలనీ వదిలేసి ఇంకెక్కడికయినా పోతాను" అన్నాడు. తాను తమాషాకి అన్నప్పటికీ, వాడు చాలా సీరియస్‌గా తీసుకున్నాడు.

"అయ్యబాబోయ్! అదేం మాటండి? మేము మీ జోలికేరాము. భయపడకండి" అంటూ హామీ యిచ్చాను.

"అదేం?"

"మీరు మంచివారండి" అన్నాడు.

రోహిణీకార్తె మండుటెండలో చల్లని వానజల్లు తగిలినట్లనిపించింది అనంతానికి. మంచికి యీ కాలంలో కూడా వాడు విలువ యిచ్చినందుకు. అయితే గంగరాజుని మంచివాడన్న నోటితోనే తనని మంచివాడంటున్నాడు. అంటే యిద్దరినీ వొకే కొలమానంతో కొలుస్తున్నాడు వాడు. ఛళ్ళున చెంపదెబ్బ తగిలినట్లయింది. ఈ రెండు' మంచిల'లో ఏ 'మంచి' అసలయిన' మంచి?' ఆలోచిస్తే తానేవిధంగా మంచివాడు? ఒకవేళ తనలో మంచివున్నా అది వుపయోగంలేని మంచితనం. నాగయ్య కొడుకులులాంటివాళ్ళకి తాను చదువుకొనడానికి సహాయం చేయగలిగివున్నా చేయలేడు, ఏదో కుంటిసాకు చెప్పి. రోడ్డుమీద పడిపోయి ఏడుస్తున్న పసిపిల్లను చూసి "అయ్యో, పాపం" అంటాడే కాని, ఆ పాపని లేపి కంటినీరు తుడువలేడు. ఆ పిల్ల కుళ్ళుగా వుంటుందని. తన యింట్లో అంతా పరిశుభ్రంగా, క్రమబద్ధంగా వుంచుగుంటాడు, కాని ఇంటి బయట ఎలావున్నా పట్టించుగోడు. అందరూ చెత్తచేస్తున్నారని తిట్టుగుంటాడు లోపల లోపల. అంతెందుకు పార్థీనియం తననంతగా బాధపెడుతున్నా, ఆచెడుని నిర్మూలించిన ఆ రెండవ కలుపుమొక్కకి తానుచేసిన సహకారమేమిటి? ఏమీ లేదు. కేవలం సానుభూతి కనబరుచుట తప్ప, చేతల్లో చూపించని తన మంచితనం పనికిరాని జ్ఞానం వంటిది. తనలాంటి మంచివాళ్ళు వున్నంతకాలం గంగరాజులాంటి 'మంచివాళ్ళు' పెరుగుతూనేవుంటారు. నోటిమంచి ఎంతమంచిదయినా 'చేతమంచి'ని పెంచనంతకాలం పార్థీనియం మొక్కలు పెరుగుతూనే ఉంటాయి అని అనుకున్నాడు అనంతం......